సమస్యల్లో 'సంక్షేమ హాస్టళ్లు'

- బీసీ హాస్టళ్లల్లో ఏళ్ల తరబడిగా తీరని సమస్యలు
- కిటికీలకు పాతబట్టలే తలుపులు
- అస్తవ్యస్తంగా బాత్‌రూంలు, మరుగుదొడ్లు
- ఏళ్ల తరబడిగా వేధిస్తున్న ప్రహరీ సమస్య
- పట్టింపులేని అధికారులు, పాలకులు

ఉప్పునుంతల: ఒకప్పుడు విద్యార్థులతో నిండుగా ఉండే బీసీ హాస్టళ్లు ప్రస్తుతం లేక వెలవెలబోతున్నాయి. సరిపడ వసతుల్లేక విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. దీంతో హాస్టళ్లలో ఉండడానికి విద్యార్థులు ఇష్టపడటంలేదు. 112 మంది విద్యార్థులు ఉన్న హాస్టళ్లు ప్రస్తుతం 30 మంది విద్యార్థులకు మించడంలేదు. కొన్నేళ్లుగా ఇన్‌చార్జి వార్డెన్‌లతో ఈ హాస్టల్‌ను నెట్టుకొస్తున్నారు. క్రమేణా బీసీ హాస్టల్ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. పాలకులుగానీ, సంబంధిత అధికారులు గానీ ఏ మాత్రం పట్టించుకోవడలేదు. సమస్యలతో పాటు విద్యార్థుల క్రమశిక్షణపై శ్రద్ధ చూపే వారు లేకపోవడంతో తమ పిల్లలను హాస్టల్‌లో చదివించడానికి తల్లిదండ్రులు ఇష్టపడటంలేదు. చాలా మంది వి ద్యార్థులు నిత్యం పరిసర గ్రామాల నుంచి ఉప్పు నుంతల జెడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చి వెళ్తున్నారు తప్పా హాస్టల్‌లో ఉండటానికి సుముఖత చూపడంలేదు.

ముందుకు సాగని చదువులు..

పదిహేను ఏళ్ల క్రితం నిర్మించిన ఈ హాస్టల్ భవనంలో తలుపులు, కిటికీలు సరిగాలేవు. చలికాలంలో విద్యార్థులు కిటికీలకు బట్టలు అడ్డుగా కడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లకు తలుపులు లేక అస్తవ్యస్తంగా ఉన్నాయి.

ప్రహరీ లేక విచ్చలవిడిగా..

హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడం పెద్ద సమస్యగా మారింది. విద్యార్థులు హాస్టల్‌లో ఉండకుండా బయట తిరగడం, రాత్రిళ్లు గ్రామానికి చెందిన విద్యార్థుల ఇళ్లలో పడుకుంటున్నారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు కనీసం పాఠశాలకు వెళ్తున్నారా? లేదా అనే విషయాన్ని కూడా చూసే వారు లేరు. పలుమార్లు అధికారులు రాత్రిళ్లు హాస్టల్‌లో బసచేసి సమస్యలు దగ్గర ఉండి చూసినా ఏ ఒక్క పని చేపట్టి సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. హాస్టల్ పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో తేళ్లు, పాములు సంచరిస్తున్నాయి.


ఉప్పునుంతల బీసీ హాస్టల్


అస్తవ్యస్తంగా స్నానపు గదులు, మరుగుదొడ్లు


హాస్టల్‌లో కిటికీలకు పాత బట్టలు అడ్డుగా పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్న విద్యార్థులు

పరిసరాల్లో పశువుల సంచారం..



ప్రహరీ లేక పశువులు, మేకలు, పందులు పరి సర ప్రాంతంలో తిరుగుతుంటాయి. ప్రహరీ ఉంటే విద్యార్థులు పాఠశాల గేట్‌కు తాళం వేస్తే బ యటకు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంటుంది. బా త్‌రూంలు సరిగా లేవు. పరిస్థితి సరిగా లేక హాస్టల్ లో విద్యార్థులు ఉండటానికి ఇష్టపడటం లేదు.

– నరేందర్, 10 తరగతి, హాస్టల్ విద్యార్థి

సమస్యలపై పలుమార్లు విన్నవించినా..

హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి, మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. మరుగుదొడ్లు, బాత్‌రూంలు సరిగా లేకపోతే సొంత డబ్బులతో తాత్కాలికంగా బాగుచేయించడం జరిగింది. ముఖ్యంగా హాస్టల్ చుట్టూ ప్రహరీ లేక ఇబ్బందిగా ఉంది. హాస్టల్ భవనంలో సమస్యలపై ఉన్నతాధికారులకు రిపోర్టు నివేదించడం జరిగింది.

– రమేష్, బీసీ హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్, ఉప్పునుంతల

క్లుప్తంగా

గుండాలలో తహసీల్దార్ ప్రత్యేక పూజలు



వెల్దండ: మండల పరిధిలోని గుండాల గ్రామంలోని శ్రీ అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాస శనివారం కావడంతో ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధికెక్కిన దేవాలయం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం తహసీల్దార్‌ను ఆయల అర్చకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణయ్య శర్మ, శివకుమార్‌శర్మ, సంతోష్‌శర్మ, సురేష్ శర్మ, తదితరులు ఉన్నారు.

ఘనంగా గీతా పారాయణం



తాడూరు: మండలంలోని శిర్సవాడ నర్సింహ స్వామి ఆలయ ఆవరణలో శనివారం గీతా పారాయణంతోపాటు హనుమాన్‌చాలీసా పఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా ఏర్పడు వ్యాస ఆశ్రయ పీఠాధిపతులు పూర్ణానందగిరి స్వామి పాల్గొన్నారు. ఆయనకు పూజారి జగదీశ్వరాచారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దేవాలయాల విశిష్టత, భక్తిభావం, సమాజంలో ప్రతి ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలని హనుమాన్ చాలీసా, గీతాపారాయణం, వాటి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఉప్పునుంతల: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని లక్ష్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, పెద్దాపూర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలల్లో సమస్యలను తెలుసుకున్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

కొల్లాపూర్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దేవని కుమార్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లను పరిమిత సంఖ్యలో కాకుండా ప్రతి గ్రామంలో అర్హులందరికీ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్దిష్ట సంఖ్యలో ఇండ్లు మంజూరు చేస్తే అవి అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే మంజూరు చేసే అవకాశం ఉందని, నిజమైన అర్హులకు న్యాయం జరగదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి పేదల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే అర్హులైన వారందరికీ ఒకే దఫాలో ఇండ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.

మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

ఉప్పునుంతల: మండల మహిళా స మాఖ్య నూతన కార్యవర్గాన్ని ఇటీవల మండలంలోని 34 గ్రామైక్య సంఘాల అధ్యక్షురాళ్లతో ఏర్పాటు చేసిన ఈసీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఐకేపీ ఏపీఎం సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా గున్నమోని లలితమ్మ, కార్య దర్శిగా పెద్దిరెడ్డి సునిత, కోశాధికారిగా షాజాహాన్ బేగం, ఉపాధ్యక్షురాలుగా మూడావత్ కంమ్లి, సహాయ కార్యదర్శిగా రాగి సునితలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రారంభానికి నోచుకున్న తహసీల్దార్ కార్యాలయం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో 1.60 కోట్లతో తహసీల్దార్ భవన కొత్త సముదాయాన్ని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 5 నెలల క్రితం ప్రారంభించారు. నేటికీ తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చకపోవడంతో నిరుపయోగంగా ఉంది. కేవలం కిటికీలకు గ్రిల్స్ ఏర్పాటు చేయలేదనే నెపంతో అధికారులు ఆ భవనాన్ని నిరుపయోగంగా మార్చారు. నూతన భవన కార్యాలయంలోకి, తహసీల్దార్ కార్యాలయాన్ని షిఫ్ట్ చేస్తే చిన్నచిన్న పనులు చేసుకోవడానికి వీలు ఉంటుంది. నెలకు రూ.50 వేలు అద్దె చెల్లిస్తూ ప్రైవేటు భవనంలోనే కొనసాగిస్తున్నారు. కొత్త భవనంలో కార్యాలయాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

నర్సరీలను పరిశీలించిన అదనపు డీఆర్‌డీఓ


కూలీలతో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో నాణ్యమైన మట్టితో పాటు పేడ వంటివి కలిపి మట్టిని కవర్‌లలో నింపాలన్నారు. పకడ్బందీగా నర్సరీల ఏర్పాటులో ఉపాధి హామీ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రసిద్దార్థ, క్షేత్ర సహాయకులు జంగయ్య, హనుమంతుశర్మ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి


కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్, పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రాత పూర్వకంగా ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని, లేని పక్షంలో సమ్మె తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కమిషనర్ రాత పూర్వకంగా ఇచ్చిన హామీ నెల రోజులవుతున్నా ఇప్పటికి పరిష్కారం కాలేదన్నారు. 2021 నుంచి కార్మికులకు పెండింగ్ ఏరియర్స్ రూ.43,600 వేలు, జనవరి రావాల్సిన, పెంచిన వేతనాలు ఇప్పటికి చెల్లించకుండా బడ్జెట్ లేదని కుంటి సాకులతో కాలం గడుపుతున్నారన్నారు. కార్మికులను బెదిరించే పనిలో నిమగ్నమయ్యారన్నారు. కనీసం సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పరుశ, భవాని, వెంకటయ్య, నర్సింహ, హుస్సేన్, రామస్వామి, కృష్ణయ్య, వెంక

బాలకార్మికుల తల్లిదండ్రులకు అవగాహన


చిన్నారులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

తెలకపల్లి: బడీడు పిల్లలు పత్తి చేలలో పనికి వాహనాల్లో వెళ్తున్న వారిని అడ్డగించి డ్రైవర్లకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని గోలగుండం గ్రామంలో ఎంఈఓ హెల్ప్‌లైన్ 1098 పోలీసు అధికారులు కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆటోలు, జీపులు, బొలెరో వాహనాలను నిలిపేసి ఎంఈఓ తనిఖీ చేశారు. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 18 సం.ల లోపు పిల్లలను వాహనాలలో పత్తి పనులకు తరలించరాదన్నారు. వారిని పాఠశాలకు పంపించాలని అవగాహ కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అధికారి ప్రమీళ, పోలీసు కానిస్టేబుల్ శ్రీనివాసులు, సీఆర్‌పీ శ్యాంసుందర్, కోనేరు సంస్థ కోఆర్డినేటర్ అంజనేయులు, ఆ సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌యాదవ్, జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

వరి ధాన్యానికి మద్దతు ధర


మొల్గరలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

ఉప్పునుంతల/లింగాల: వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు మద్దతు ధర అందుతుందని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మొల్గరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, కాంసానిపల్లి, మామిళ్లపల్లి, పెనిమిళ్లలో ఐకేపీ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంతటి రజిత, ఆర్డీఓ మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2320లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్న రకం వరిధాన్యానికి అదనంగా రూ.500లు బోనస్ కలిపి ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ నరసయ్యయాదవ్, నోడల్ అధికారి షేక్ మహ్మద్, ఐకేపీ ఏపీఎం సైదులు, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీను, కొత్త రవీందర్‌రావు, సీఈఓ రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రమేష్ రెడ్డి, కృష్ణ, మాజీ జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

- లింగాల మండలంలోని గ్రామాలలో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. లింగాల, సూరాపూర్, కోమటికుంట గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురులో వరి కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ కృష్ణయ్య, రైతులు వెంకటయ్య, సామయ్య, రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: మండలంంంలోని ఇప్పలపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సహకార సంఘం ఉపాధ్యక్షుడు చిలుక రాందేవ్‌రెడ్డి ప్రారంభించారు. ఇప్పలపల్లితో పాటు చుట్టు పక్కల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వెంకట్రామ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారిణి శోభారాణి పరిశీలించారు. మండలంలోని కొట్ర, బొల్లంపల్లి, వెల్దండలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం మిషన్ ద్వారా వరి ధా న్యం తేమశాతాన్ని పరిశీలించారు. వారి వెంట ఏఈఓ సురేష్‌గౌడు, భిక్షపతి ఉన్నారు.

జెడ్పీమైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలోని జెడ్పీ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా నా యకులు నాగపూర్ మధు మాట్లాడు తూ ఆరోగ్య సమస్యల రీత్యా ఉదయం, సాయంత్ర పట్టణంలోని జెడ్పీమైదానంలో వాకింగ్, వ్యాయామం కోసం ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారని, వాకింగ్ ట్రాక్ లాంటి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అశోక్, నాయకులు కురుమయ్య, నవీన్, ఆంజనేయులు, బచ్చలి, వినోద్, రాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజు గడువు పెంచాలి

అచ్చంపేట: పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంచాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు కోరారు. శనివారం వారు అచ్చంపేటలో మాట్లాడుతూ మార్చి 25లో జరిగే టెన్త్ పబ్లిక్ ప రీక్షల ఫీజు చెల్లింపు గడువు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెలాఖరు వరకు పొడిగించాలని కోరారు. జిల్లాలో వందకు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వివరాలు జనరల్ ప్రొఫైల్‌లో అక్షర దోషాల కారణంగా అప్డేట్ కాలేదని, డీఎస్ఈ పోర్టల్‌లో చూపడం లేదన్నారు. ఫలితంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈనెల 18వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించడం సాధ్యం కాదని, ఈనెలాఖరు వరకు సమయం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పోకల సంతీష్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఒగ్గు సుదర్శన్,ఆర్. నారాయణగౌడులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల మహాసభ జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: 17న రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం ఎలైట్ హోటల్‌లో జరిగే నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంల ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ శనివారం పిలుపునిచ్చారు. 15 ఏళ్లుగా రెండో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారందరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 33 రికార్డులతో పనిభారం పెట్టి ఏఎన్ఎంలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై 17న జరిగే మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాటాలకు నిర్ణయం తీసుకుంటామన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీ



లింగాల: మండలంలోని శాయిన్‌పేట ప్రాథమికోన్నత, కొత్తచెర్వుతండా ప్రాథమిక పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఏఎస్, మాక్ టె స్ట్ ప్రశ్నాపత్రాలను, విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. భోజనం నాణ్యత బాగుండాలని, మెనూ ప్ర కారం భోజనం అందించాలని వంట ఏజెన్సీలను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, కాంప్లెక్స్ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

వేధింపులకు గురైతే షీ టీంను ఆశ్రయించండి



బిజినేపల్లి: మహిళలు, యువతులు వేధింపులకు గురైతే తక్షణమే షీ టీంను ఆశ్రయించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచి తగిన న్యాయం చేస్తామని షీ టీం ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని గంగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో షీ టీం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయంలో కార్తీక దీపాలు



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక రామాలయంలో కార్తీక దీపాలు మహిళా భక్తులు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ద్విచక్రవాహనం చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన రాకేష్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సెప్టెంబర్ 29న తన ద్విచక్ర వాహనాన్ని ఓంనగర్ కాలనీలో తన ఇంటిముందు పార్కింగ్ చేశాడు. ఈనెల 14న జిల్లా కేంద్రానికి వచ్చి తన ద్విచక్రవాహనం కనపడక పోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి శనివారం పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పరిమితికి మించి ప్రయాణం



బల్మూర్: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆటోలలో 20 మంది వరకు కిక్కిరిసి ప్రయాణం చేస్తూ ప్రాణాలతో చేలగాటం ఆడుతున్నారు. మండలంలోని బల్మూర్, కొండనాగుల, తుమ్మెన్‌పేట, బాణాల, గట్టుతుమ్మెన్ గ్రామాల నుంచి ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లిలో శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా రెండో రోజు సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు.మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్ఐ నరేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని గుండూరు గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బ్లూ కోల్ట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. యజమాని భగవంత్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.





మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నాగర్‌కర్నూల్ – జి. సంపత్ కుమార్ - 88865 67081
కొల్లాపూర్ – వై. కురుమూర్తి - 79979 58205
అచ్చంపేట / కల్వకుర్తి – యం. విజయ్ - 99630 23777

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్ 9951602829
పి. మధుసూదన్ గౌడ్: 90100 06785